VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI
QEAC No. E334
1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
91(40) 27628134, 27674037
victoria.ashoknagar@gmail.com
://www.victoriaoverseas.com

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక


సంపుటి: 5 సంచిక: 241, పేజీలు - 08
సోమవారం, ఫిబ్రవరి 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

NEWS
- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

## అమెరికాతో ట్రేడ్ డీల్ పై మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి

**- ప్రధానికి 5 సూటి ప్రశ్నలు సంధించిన రాహుల్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా 2లో..

## గులాబీ బాటలో జాగృతి ముళ్లు



**- ఓట్ల చీలికతో ముప్పు తప్పదా.?**

**(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)**



తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అనూహ్య మలుపులు తిరుగుతోంది. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని ఏలిన భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది.

ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చే ప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

### సింహం గుర్తు ఎఫెక్ట్.. ఓట్ల చీలికతో ముప్పు

మున్సిపల్ ఎన్నికల్లో కవిత ప్రత్యక్షంగా పార్టీ పెట్టకపోయినా, తన మద్దతుదారుల ద్వారా సింహం గుర్తుకు మద్దతు ఇచ్చి కొన్ని చోట్ల గట్టి ప్రభావమే చూపారు. ఈ పరిణామం బీఆర్ఎస్ పెద్దల కళ్లు బైర్లు కమ్మేలా చేసింది. కవిత పార్టీ పెట్టడం వల్ల ఆమె అధికారంలోకి వస్తారా లేదా అన్నది పక్కన పెడితే, ఆమె చీల్చే నాలుగు నుంచి ఐదు శాతం ఓట్లు బీఆర్ఎస్ గెలుపోటములను తలకిందులు చేయడం ఖాయం. ఉమ్మడి సిద్ధాంతాలు, ఒకే రకమైన ఓటు బ్యాంకు 2లో..

## ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

**- చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు**
**- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి**
**- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్**
**- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం**



అమరావతి (ప్రశ్న న్యూస్) మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు, గేట్స్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ బిల్ గేట్స్ నేడు ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ పరస్పర సహకారం చేపట్టిన ప్రాజెక్టులను సమీక్షిస్తారు. అలాగే మరిన్ని అంశాలపై పరస్పర సహకారం విస్తరించుకునే విషయాలపై చర్చిస్తారు. ఏపీ పర్యటనలో భాగంగా బిల్ గేట్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లతో భేటీ కానున్నారు. ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్ సహకారం సంజీవని ప్రాజెక్టు చేపడుతోంది. ఈ అంశం మీద ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో టెక్నాలజీ ఆధారిత డయాగ్నస్టిక్ సేవలు, మెడ్ టెక్ కార్యక్రమాలపైనా చర్చించనున్నట్లు తెలిసింది. మరోవైపు బిల్ గేట్స్ ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ స్టేట్ సెంటర్ కూడా సందర్శిస్తారు, పాలనలో టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తున్నారనే అంశాన్ని పరిశీలిస్తారు. 2లో..

## రోడ్డులేని తండా ఉండకూడదు

**- రాష్ట్రంలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు**
**- లంబాడా యువతకు అండగా ఉంటాం**
**- సీఎం రేవంత్ కీలక ప్రకటన**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని అన్ని తండాలకు బీటీ రోడ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. లంబాడా యువతకు తమ ప్రభుత్వం అంటుందని అన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. 2లో..

## కరీంనగర్ మేయర్ పీఠం మాదే

**- మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాగా వేసింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఓటర్లు ఏ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని కట్టబెట్టకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే క్యాంప్ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీలు, 2లో..

## రైతులకు పూర్తి రక్షణ.. రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు

**- చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి అమిత్ షా సవాల్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు.గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ 2లో..

## ఏపీ లోకల్ పోల్స్

**- బీఆర్ఎస్ స్ఫూర్తితో వైసీపీ పోరాటానికి రెడీ.?**



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు, వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**- భవిష్యత్‌పై నమ్మకం పెట్టుకున్న బీఆర్ఎస్**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 2లో..

## కరీంనగర్ కింగ్ ఎవరు.?

**- రసవత్తరంగా కరీంనగర్ రాజకీయాలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడగా అత్యధిక స్థానాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వశం అయ్యాయి. కానీ కొన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో హంగ్ రావడంతో జోరుగా క్యాంప్ రాజకీయాలు సాగుతున్నాయి. ఇక సోమవారమే గెలిచిన అభ్యర్థుల ప్రమాణ స్వీకారంతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక జరగనుండటంతో ఈ హంగ్ వచ్చిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎలాంటి తీర్పు రానుంది మేయర్, ఛైర్‌పర్సన్ పీఠాలను ఎవరు కైవసం చేసుకుంటారు 2లో..

## నేనే రాజు, నేనే మంత్రి వ్యాఖ్యలపై క్లారిటీ

**- తన వ్యాఖ్యలను వక్రీకరించారన్న ముఖ్యమంత్రి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 'నేనే రాజు నేనే మంత్రి' అంటూ తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విపక్ష నాయకులు విమర్శలు గుప్పించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఇటీవల విలేకరులతో పిచ్చాపాటిగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'నేనే రాజు నేనే మంత్రి' అని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తదితరులు విమర్శలు గుప్పించారు. దీంతో రేవంత్ రెడ్డి తాజాగా ఆ వ్యాఖ్యలపై స్పష్టతను ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆయన అన్నారు. గెలుపు, ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటాననే ఉద్దేశంలో చెప్పానని ఆయన వెల్లడించారు. కానీ దానిని మరోలా అర్థం చేసుకున్నారని తెలిపారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేను ఎప్పుడూ పాలకుడిగా 2లో..

## కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో సింగరేణి కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే సీపీఐకి మద్దతిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను దోచుకోవడంలో కాంగ్రెస్, 2లో..

## శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ

**- తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తిన శైవ క్షేత్రాలు**
**- భక్తులతో నిండిన శివాలయాలు**
**- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. 2లో..

## పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్

**- వరల్డ్ కప్ సూపర్-8లోకి గ్రాండ్ ఎంట్రీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 61 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. 2లో..

# అమెరికాతో ట్రేడ్ డీల్ పై మోదీ సర్కార్‌పై దాడి

ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?
2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?
3. మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?
4. 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?
5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?

# ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

ఈ సందర్భంగా రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్స్ పనితీరు, డేటా డ్రైవన్ మానిటరింగ్ మెకానిజం గురించి చంద్రబాబు, ఇతర అధికారులు బిల్ గేట్స్‌కు వివరిస్తారు. అనంతరం స్వర్ణాంధ్ర విజన్ 2047 సంస్కరణపైనా చర్చిస్తారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 కింద ప్రజారోగ్యం, వ్యవసాయ రంగం, విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణల గురించి బిల్ గేట్స్‌కు వివరిస్తారు. అనంతరం ఉండవల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని కూడా బిల్ గేట్స్ బృందం పరిశీలించనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా వ్యవసాయంలో డ్రోన్స్ వినియోగం, ఏఐ పరికరాల ఉపయోగాన్ని పరిశీలించనున్నట్లు తెలిసింది.

**- ఏంటీ సంజీవని ప్రాజెక్టు..**

ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణగా ఏపీ ప్రభుత్వం సంజీవని పథకాన్ని రూపొందించింది. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు, మాతా శిశుసంరక్షణ, వ్యాక్సినేషన్ వంటి సేవలు అందించే ఆలోచనలో ఉన్నారు. సంజీవని ప్రాజెక్టు కింద డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ఉంటుంది. ఈ డిజిటల్ హెల్త్ కార్డులలో పౌరులకు సంబంధించిన వైద్యపరీక్షలు, చికిత్సల వివరాలతో పాటుగా, డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ నివేదికలు, వ్యాక్సినేషన్ వివరాలు నమోదవుతాయి. అలాగే రెండున్నర లక్షల వరకూ ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో సంజీవని ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అక్కడ సత్ఫలితాలు రావటంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది.

# ఏపీ లోకల్ పోల్స్

15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.

**- ఏపీలో వైసీపీ నీరసం.. బహిష్కరణే శరణ్యమా?**

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం, మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది.

**- క్యాడర్‌లో అయోమయం.. నాయకత్వ లోపమా?**

ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉంది.

**- అవకాశం వదులుకుంటే మనుగడ కష్టమే!**

ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనాలు వస్తున్నాయి.

# రోడ్డులేని తండా ఉండకూడదు

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో లాంబాడా యువకులది కీలక పాత్ర అని గుర్తుచేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో లంబాడాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని సీఎం రేవంత్ ప్రశంసించారు. తెలంగాణలోని అన్ని లంబాడా తండాలను అభివృద్ధి చేస్తామని మౌళిక వసతుల కల్పనల్లో భాగంగా బీటీ రోడ్లు వేయిస్తామన్నారు. ఈ మేరకు సభ నుంచి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇకనుంచి రాష్ట్రంలో రోడ్లు లేకుండా ఏ తండా ఉండకూడదని చెప్పారు. మరో నాలుగు నెలల్లో తాను 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకోబోతున్నానని గుర్తు చేశారు. ఆలోపే తండాలన్నింటికీ రోడ్ల సౌకర్యం కల్పిస్తామని ప్రకటన చేశారు.

తాను మొదటిసారి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీగా పోటీ చేసినప్పుడు లంబాడా యువత తన వెన్నంటి ఉండి గెలుపుకు కృషి చేశారని గుర్తు చేశారు. తండాల్లో విద్యను మెరుగుపరిచే కార్యక్రమంలో భాగంగా ప్రతి తండాలో ప్రభుత్వ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. లంబాడా యువకులు అందరూ తమ భవిష్యత్తును గొప్పగా మల్చుకోవాలని సూచించారు. తండాల్లోనే ఉంటాం, ఇక్కడే ఉపాధి పొందాతాం అనే ధోరణిని మైండ్‌లో నుంచి తీసేయాలని సూచించారు. బాగా చదివి గ్రూపు-1, గ్రూపు-2, డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, నచ్చిన రంగంలో రాణించేలా కృషి చేయాలని అందుకు తమ ప్రభుత్వం సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని వారికి భరోసా ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక క్లారిటీ ఇచ్చారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలోని 50 లక్షల కుటుంబాలకు ఉచితంగా 200 లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద రూ. 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామన్నారు. ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని మరిన్ని ఉద్యోగాలు భర్తు చేస్తామన్నారు. ఇక రైతులను ఆదుకునేందుకు ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు.

# కరీంనగర్ మేయర్ పీఠం మాదే

కార్పొరేషన్లు హస్తం పార్టీ చేజారి పోవద్దని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతోపాటు మంత్రులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్రంలో రాజకీయం హీటెక్కింది. ఈ నేపథ్యంలోనే కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ మేయర్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కూడా పోటీలో ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కరీంనగర్‌లో చివరి నిమిషంలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారిపోతున్నాయి. కరీంనగర్ మేయర్ పీఠం ఎవరిదో సోమవారం రోజు తేలిపోతుందని పేర్కొన్న పొన్నం ప్రభాకర్, మేయర్ పీఠాన్ని దక్కించుకునే రేసులో హస్తం పార్టీ ముందుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో బీజేపీకి ఎక్కువ స్థానాలు రాగా మేయర్ ఎన్నికలు గెలవాలని కేంద్రమంత్రి బండి సంజయ్ నేతృత్వంలో అన్ని ప్రయత్నాలు చేస్తున్న వేళ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. మరీ ముఖ్యంగా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందించిన పొన్నం ప్రభాకర్ తమది రాజకీయ పార్టీ అని తాము కచ్చితంగా రాజకీయాలు చేస్తామని స్పష్టం చేశారు. అందులో దాపరికం ఏముందింటూ తేల్చి చెప్పారు. కరీంనగర్ మేయర్ కుర్చీని దక్కించుకుంటాని పూర్తి విశ్వాసం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం కాంగ్రెస్ హయాంలోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమని తేల్చి చెప్పారు.

# రైతులకు పూర్తి రక్షణ..

## రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు

పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కరీంనగర్ కింగ్ ఎవరు.?

అనే ఉత్కంఠ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్రం మొత్తం చూపు కరీంనగర్ కార్పొరేషన్‌పై పడింది. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. రెండు పార్టీలకు సరైన మెజార్టీ రాకపోవడంతో ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కోసం క్యాంప్ రాజకీయాలకు తెరలేపాయి. 66 డివిజన్లు ఉన్న కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, స్వతంత్రులు 8, ఎంఐఎం 3, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 2 స్థానాల్లో గెలిచాయి. మెజార్టీ మార్కు 34 కాగా బీజేపీ స్వతంత్రులను తమవైపు తిప్పుకుంది. దీంతో ఇండిపెండెంట్ల మద్దతుతో కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని ధీమాగా ఉన్న కాషాయ పార్టీకి షాక్ తగిలింది. అయితే ఇదే ఇప్పుడు మరో ట్విస్ట్‌కు దారి తీసింది. బీజేపీకి సపోర్ట్ చేసిన కార్పొరేటర్లు ఇప్పుడు కాంగ్రెస్‌లోకి దూకడం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట్ రిసార్ట్‌లో క్యాంపు రాజకీయాలు జోరుగా సాగుతున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. రిసార్ట్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన కార్పొరేటర్లతోపాటు కొందరు ఇండిపెండెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారితో ఇప్పటికే మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావులు చర్చలు జరిపినట్లు సమాచారం. ఇక టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా రిసార్ట్‌కు చేరుకోనున్నట్లు తెలుస్తోంది. ఇక ఇటీవల ఫలితాలు వెల్లడైన తర్వాత బీజేపీకి మద్దతు ఇచ్చిన నలుగురు ఇండిపెండెంట్ కార్పొరేటర్లలో ఇద్దరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు కూడా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ క్యాంపులోనే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వీరితోపాటు కరీంనగర్ 15వ డివిజన్ కార్పొరేటర్‌గా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి గెలిచిన సాయిజ్యోతి, కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో ఇటీవలె కాషాయ కండువా కప్పుకుని బీజేపీలోకి చేరారు. ఆ తర్వాత ఒక వీడియో విడుదల చేసిన సాయిజ్యోతి సోమవారం జరగనున్న మేయర్ ఎన్నికలో తనకు ఇష్టం ఉన్న వారికి ఓటు వేస్తానని చెప్పడంతో బీజేపీ నేతల్లో టెన్షన్ నెలకొంది. దీంతో సాయిజ్యోతి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ కార్యకర్తలు ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. అయితే తన పిల్లలకు ఆరోగ్యం బాగోలేదని తాను వేరే ఊరికి వెళ్లినట్లు తెలిపిన సాయిజ్యోతి తన ఇంటి వద్ద ఆందోళన చేస్తే పోలీసులకు కంప్లైంట్ చేస్తానని హెచ్చరిస్తూ మరొక వీడియో రిలీజ్ చేశారు. ఇక స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లతో నంబర్ గేమ్ మార్చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే కరీంనగర్ మేయర్ సీటు రేసులో తమ పార్టీ కూడా ఉందని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడం తీవ్ర సంచలనం రేపుతోంది. బీజేపీకి పూర్తి స్థాయి మెజార్టీ రాలేదని ఎలా మేయర్ పీఠాన్ని దక్కించుకుంటుందని ప్రశ్నించారు. రేపు జరిగే మేయర్ ఎన్నిక సమయానికి ఏదైనా జరగొచ్చని పేర్కొనడంతో అసలు ఏం జరుగుతోంది అనే తీవ్ర ఆసక్తిని రేపుతోంది.

# నేనే రాజు, నేనే మంత్రి వ్యాఖ్యలపై క్లారిటీ

ప్రవర్తించలేదని, సేవకుడిగానే భావిస్తున్నానని అన్నారు. ప్రజలు తమకు సేవ చేయడానికి ఓటు వేసి గెలిపించారని పేర్కొన్నారు. అందుకే రాజకీయ నాయకులు పాలకులుగా భావించుకోవద్దని, సేవకులుగానే ఉండాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్షాలు ప్రజలను నిందిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఉండాలని అన్నారు. తండాలకు సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంట్ విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని అన్నారు. తాము సంక్షేమంతో పాటు విద్యార్థులకు మంచి విద్య కూడా ఇవ్వాలనుకుంటున్నామని అన్నారు. చదువుకుంటేనే మంచి ఉద్యోగాలు, కీలక పదవులు వస్తాయని అన్నారు.

# కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ

## ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

బీజేపీ రెండూ భాగస్వాములేనని, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సీపీఐకి అనుబంధంగా ఉన్న ఏఐటీయూసీ కూడా కాంగ్రెస్‌తో పొత్తును ఎలా అంగీకరించిందో అర్థం కావడం లేదని, దీని వెనుక ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తెలియదన్నారు. ఎవరు కలిసినా, కలవకపోయినా సింగరేణి కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తేల్చిచెప్పారు. గతంలో తమ ప్రభుత్వం గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వేలాది మంది గిరిజన యువతకు రాజకీయ అవకాశాలు కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. సుమారు 4.5 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనుల భూ హక్కులను కాపాడామని తెలిపారు.

# శైవక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ

ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు, శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్

కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈరోజు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గ్రూప్-ఏలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. తద్వారా టోర్నమెంట్‌లో సూపర్-8 దశకు అధికారికంగా అర్హత సాధించింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆది నుంచే తడబడింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఒక దశలో 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఉస్మాన్ ఖాన్ (44) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. అయితే, అతడు ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. భారత బౌలర్లు మూకుమ్మడిగా రాణించడంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌట్ అయింది. హార్దిక్, బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తిలక్ వర్మ (25), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) నుంచి మంచి సహకారం లభించింది. అయితే, మిడిల్ ఓవర్లలో హార్దిక్ పాండ్య (0) విఫలమవడంతో స్కోరు వేగం తగ్గింది. చివర్లో శివమ్ దూబే (17 బంతుల్లో 27), రింకు సింగ్ (4 బంతుల్లో 11) వేగంగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇక, భారత్ గ్రూప్-ఏలో తన చివరి లీగ్ మ్యాచ్ ను నెదర్లాండ్స్ తో ఈ నెల 18న అహ్మదాబాద్ లో ఆడనుంది.

# గులాబీ బాటలో జాగృతి ముళ్లు

ఉండటంతో కవిత వైపు వెళ్లే ప్రతి ఓటు నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్ అవుతుంది. ఇది త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల కొంప ముంచేలా ఉంది.

**కృష్ణార్జునులపై విమర్శలు.. పెరిగిన అంతరం**

కవిత తన రాజకీయ ప్రస్థానాన్ని కేవలం విమర్శలకే పరిమితం చేయకుండా, బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె సంధిస్తున్న విమర్శలు పార్టీ కార్యకర్తల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల గౌరవం చూపిస్తూనే, పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఆమె చేస్తున్న దాడి ద్వారా అసంతృప్త నేతలను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రానున్న రోజుల్లో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణాన్ని దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తోంది.

**బీసీ అస్త్రం.. సామాజిక సమీకరణాల రాజకీయం**

ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై దెబ్బకొట్టేలా ఉన్నాయి. మరో మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు , జెండాను ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేయడం, రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉద్యమ కాలం నుంచి తనతో నడిచిన తెలంగాణ జాగృతి కేడర్ ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ శక్తిగా మారితే, అది బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది.

**ఉక్కపోతలో గులాబీ కేడర్**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, కవిత వేస్తున్న అడుగులను గమనిస్తుంటే, రానున్న రోజుల్లో తెలంగాణలో చతుర్ముఖ పోరు తప్పదనిపిస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటుంటే, మరోవైపు బీజేపీ తన ఉనికిని చాటుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కవిత రూపంలో ఎదురవుతున్న ఈ సొంత ముప్పును బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆమె చేసే విమర్శలు ఆమెకు సానుభూతిని కూడగట్టడమే కాకుండా, తనకంటూ ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రాజకీయ యుద్ధంలో కవిత గెలుస్తారో లేదో కానీ, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## గవర్నర్‌ను దూషించిన డీఎంకే నేతకు

# మూడేళ్ల జైలుశిక్ష వేసిన కోర్టు



తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తికి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరపు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.

## ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి



నారాయణపేట : జిల్లాలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన రైతు ఒకరు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. తిప్రాస్‌పల్లి శివారులో ఉన్న వేరు శనగ పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన మద్దుమ్ అలీ (54) అడవి పందులు రాకుండా పెట్టిన ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌కు తగిలి ప్రమాదవశాత్తు గురై మరణించాడు. భార్య షాహిదా బేగం భర్తకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానంతో బంధువులతో కలిసి పంట చేనుకు వెళ్లి పరిశీలించగా చేనులో అచేతనంగా పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని ధృవీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జోష్ నింపుతున్న ఆత్మీయ కలయిక

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారు. కేవలం పాలన, రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజాప్రతినిధులతో కుటుంబ సభ్యుల తరహా బంధాన్ని పటిష్టం చేసుకునే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. "ఆత్మీయ కలయిక ? ఇల్లే వేదిక" పేరుతో లోకేష్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.సాధారణంగా రాజకీయ భేటీలు అంటే వ్యూహాలు, ప్రతివ్యూహాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో కూడి ఉంటాయి. కానీ, లోకేష్ నిర్వహిస్తున్న ఈ సమావేశాలు అందుకు పూర్తి భిన్నం. ఉండవల్లిలోని తన నివాసంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను వారి కుటుంబ సభ్యులతో సహా ఆహ్వానించి, ఒక ఆత్మీయ విందును ఏర్పాటు చేయడం ద్వారా లోకేష్ అందరినీ ఆశ్చర్యపరిచారు.ఈ నూతన సంప్రదాయానికి తొలి వేదికగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం నిలిచింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో సహా లోకేష్ నివాసానికి తరలివచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల వల్ల ఎంపీ బాలశౌరి, విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా వెనిగండ్ల రాము ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.ఈ కలయికలో లోకేష్ చూపిన ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచింది. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికుల నైపుణ్యానికి గుర్తింపుగా, వచ్చిన ఆడపడుచులందరికీ మంగళగిరి పట్టుచీరలను బహుకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఇది కేవలం బహుమతి మాత్రమే కాదు, తన నియోజకవర్గ నేతన్నల పట్ల ఆయనకున్న గౌరవానికి, అతిథుల పట్ల ఉన్న మర్యాదకు నిదర్శనం.ఈ సమావేశంలో కేవలం మాటలు, ముచ్చట్లే కాదు.. బాధ్యత కూడా కనిపించింది. గతంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి తాజా స్థితిగతులపై ఒక సమగ్ర నివేదికను లోకేష్ వారికి అందజేశారు. సమస్యలు చెప్పడమే కాదు, వాటి పరిష్కారం ఎక్కడి వరకు వచ్చిందో అధికారికంగా నివేదిక ఇవ్వడం లోకేష్ పనితీరులోని పరిణతిని చూపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఈ తరహా సమావేశాల వల్ల పార్టీ నాయకులను కేవలం రాజకీయ యంత్రాలుగా కాకుండా, ఒక కుటుంబంగా భావించడం వల్ల వారిలో పార్టీ పట్ల విధేయత, ఉత్సాహం పెరుగుతాయి. చంద్రబాబు క్రమశిక్షణకు మారుపేరైతే, లోకేష్ ఆ క్రమశిక్షణకు 'ఆత్మీయత'ను జోడించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి నేరుగా నియోజకవర్గ సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ఫీడ్ బ్యాక్ ఇవ్వడం ద్వారా పాలనలో వేగం పెరుగుతుంది. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో మమేకం కావడం ద్వారా, నాయకులకు ఇంటి నుంచే పూర్తి మద్దతు లభించేలా చేయడం లోకేష్ దార్శనికతకు అద్దం పడుతోందిలోకేష్ చేపట్టిన ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం టీడీపీలో కొత్త జోష్ నింపుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల నేతలతో ఇటువంటి భేటీలు జరగనున్నాయి. ఇది కేవలం ఒక డిన్నర్ మీటింగ్ మాత్రమే కాదు, భవిష్యత్తు నాయకత్వ పటిమను, పార్టీ పట్ల లోకేష్‌కు ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పే ఒక రాజకీయ సంస్కరణగా చెప్పవచ్చు.ఇక మండలిలో అయితే. పాలనను గాడిలో పెడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది కూటమి. అయితే అంతకుముందు ఉన్న ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన చాలా వాటిని పూర్తిచేస్తూ.. కొత్త వాటికి చెల్లింపులు చేస్తోంది. తాజాగా విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 1200 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో కీలక ప్రకటన చేశారు. జగన్ సర్కార్ 4వేల కోట్లను బకాయి పెట్టిందని గుర్తు చేశారు. దీనిపై శాసనమండలిలో వైసిపి పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ తీరును తప్పుపడుతూ.. సభ నుంచి వాకౌట్ చేశారు.ప్రభుత్వ విద్యావ్యవస్థకు సంబంధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలిలో పలు అంశాలను ప్రస్తావించింది.. ఈ క్రమంలో విశాఖలో గీతం విద్యాసంస్థల భూ కేటాయింపులతో పాటు వివిధ పరిశ్రమలు, సంస్థలకు భూ కేటాయింపుల విషయమై బొత్స ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా భూ కేటాయింపులు జరిపితే.. దానిని నిరూపిస్తే.. మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రిగా బొత్స ఉండే సమయంలో విజయనగరం జిల్లాలో ఆయన కుటుంబ సభ్యులు.. కోట్లాది రూపాయల భూములను కారు చౌకగా కొట్టేసారని మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై శుక్రవారం చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం నడిచింది. ఇటువంటి పరిస్థితుల్లో మంత్రి బొత్స ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ వైసిపి సభ్యులతో కలిసి శాసనమండలిని వాకౌట్ చేయడం విశేషం. అంతకుముందు సభలో విద్యావ్యవస్థ పై జరిగిన చర్చలో బొత్సతో మంత్రి నారా లోకేష్ వాగ్వాదానికి దిగారు.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేశారు బొత్సపాఠశాల విద్యా శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రమంలో కొన్ని రకాల చెల్లింపులు, సక్రమంగా జరగలేదు. ప్రధానంగా ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయలను అప్పటి జగన్ సర్కార్ విద్యార్థులకు అందించకుండా ఇబ్బంది పెట్టింది. ప్రైవేటు కాలేజీల్లో చేరే విద్యార్థులకు సైతం ఈ ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తామని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సామాన్య పేద విద్యార్థులు సైతం ప్రైవేట్ కాలేజీల్లో చేరారు. కానీ ఫీజు రీయంబర్స్మెంట్ మాత్రం చెల్లించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఫీజు రియంబర్స్మెంట్ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేస్తూ వస్తోంది. నిన్ననే 1200 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని లోకేష్ ఈరోజు శాసనమండలిలో ప్రస్తావించేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు తట్టుకోలేకపోయారు. అందుకే బొత్స సభను వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటన చేసి బయటకు వెళ్లిపోయారు.

# అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా

భారత్ అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు.భారత్?అమెరికా మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. దానికి ముందు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన 50% టారిఫ్‌లను 18%కి తగ్గించారు. వాణిజ్య ఒప్పందం తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్ రష్యా ఆయిల్ కొనుగోలు తగ్గించి అమెరికా, వెనెజువెలా నుంచి కొంటుందని ప్రకటించారు. దీనిపై భారత్ అధికారికంగా స్పందించకపోయినా, గణాంకాలు మార్పును నిర్ధారిస్తున్నాయి. పుతిన్ దీన్ని భారత నిర్ణయంగా గుర్తించారు.2025 డిసెంబర్‌లో రష్యా నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ దిగుమతి చేసుకుంది. నవంబర్‌లోని 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయిల్ కొనుగోలు చేసింది. అంటే నెల రోజుల్లో ఆయిల్ దిగుమతి 27% తగ్గించింది. మొత్తం భారత ఆయిల్ దిగుమతిలో రష్యా వాటా 34% నుంచి 24.9%కి పడిపోయింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 15% కొనుగోలు తగ్గింది. 38 నెలలుగా రష్యా నుంచి జరుగుతున్న కొనుగోలులు ఇదే తక్కువ.అమెరికా నుంచి 2025 డిసెంబర్ దిగుమతులు 2024తో పోలిస్తే 31% పెరిగాయి. రష్యా నుంచి 15 శాతం తగ్గితే.. అమెరికా నుంచి దిగుమతి రెట్టింపైంది. వెనెజువెలా కూడా ప్రధానంగా చేరుతోంది. ఇది ట్రంప్ వాగ్దానాలకు సమానంగా ఉంది, కానీ ఆర్థిక లాభాలు ప్రశ్నార్థకం.రష్యా ఆయిల్ రవాణా ఖర్చు అమెరికా ఆయిల్ షిప్పింగ్ చార్జీలతో పోలిస్తే సగం ఉంటుంది. రష్యా నుంచి మనం రూపాయిల్లో కొనుగోలు (పెట్రో?రూపీ ఇన్వెస్ట్‌మెంట్) చేశాం. ఆ రూపాయలను కూడా రష్యా భారత్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. అమెరికా నుంచి డాలర్లలోనే లావాదేవీలు జరుపుతున్నాం. ఇక అమెరికా నుంచి రవాణాకు భారత్ బ్యారెల్‌కు 4 నుంచి 5 డాలర్లు అదనంగా చెల్లించాలి. వెనెజువెలా ఆయిల్ కొంటే బ్యారెల్‌కు 10 డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. రష్యా ఆయిల్ తక్కువగా వస్తున్నా.. అమెరికా ఒత్తిడి కారణంగానే మోదీ రష్యా ఆయిల్ తగ్గించి అమెరికా ఆయిల్ పెంచినట్లు చర్చ జరుగుతోంది.ఆయిల్ తగ్గుదల అమెరికా ఒత్తిడికి సూచన. తదుపరి రష్యా ఆయుధాలపై ఆంక్షలు, అమెరికా సామగ్రిని కొనుగోలు డిమాండ్ రావచ్చు. ఇది భారత విదేశాంగ వ్యూహాన్ని పరీక్షిస్తుంది.ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్?డిసెంబర్ మధ్య 27% తగ్గుదల.నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి.డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది.

అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది.ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం.స్వాతంత్ర్య నిర్ణయాలు ఆర్థిక ఒత్తిడికి గురవకూడదు.రష్యా ఆధారం తగ్గడం ధరల పెరుగుదలకు దారితీస్తుంది. ఆత్మనిర్భర్ ఎనర్జీ, వైవిధ్యమైన మూలాలు అవసరం. అమెరికాకు పూర్తి తలొగ్గడం దీర్ఘకాలిక ప్రమాదం. సమతుల్య వాణిజ్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కీలకం.

# కోమటిరెడ్డి ధైర్యం ఏంటీ..



**నల్గొండ,** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలనే సాధించింది. ఈ విజయంతో సంబరాల ఊపులో ఉన్న టైంలోనే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని లేకుంటే డైరెక్ట్‌గా సీఎం కుర్చీనే టార్గెట్ లాక్కుంటానని హెచ్చరించారు. ఇప్పుడే కాదు ఆయన గతంలో కూడా ఇలాంటి కామెంట్స్ చాలా చేశారు. తనను పార్టీలోకి తిరిగి తీసుకున్నప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారని ఇప్పుడు అది కావాలంటూ చాలా కాలం నుంచి పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయినా ఆయన్ని ఎవరూ పిలిచి మాట్లాడటం లేదు. ఆయన కామెంట్స్ ఆగటం లేదు. ఇప్పుడు మరోసారి కామెంట్స్‌తో వార్తలకెక్కారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు. అయితే ప్రతిపక్షంలో ఉన్న టైంలో ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. తర్వాత అక్కడి నుంచి 2023 ఎన్నికల టైంలో మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి పదవి హామీతోనే పార్టీలోకి తీసుకొచ్చినట్టు ఆయన చెప్పుకుంటున్నారు. ఆయన సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. అందుకే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం రాజగోపాల్ రెడ్డికి మంత్రిపదవి ఇవ్వడం సాధ్యం కాదు. అయినా నాకు మంత్రి పదవి కావాల్సిందేనంటూ మొండికేస్తున్నారు. మంత్రి పదవి ఎలాగైనా సాధించుకోవాలని సమయం వచ్చినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు రాజగోపాల్ రెడ్డి. రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బాణాలు సంధిస్తూనే ఉన్నారు. ఆయన మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఒకట్రెండు సార్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలిచి మాట్లాడింది. కానీ వాటిని పట్టించుకోవడం లేదు. అందుకే రోజు రోజుకు ఆయన విమర్శల డోసు పెరుగుతూనే ఉంది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవి అంశాన్ని ప్రస్తావించారు. పార్టీలోకి తీసుకొని వచ్చినప్పుడు తనకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రిపదవి ఇవ్వాలని రాజగోపాల్ డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే డైరెక్ట్‌గా సీఎం అవుతానంటూ హెచ్చరించారు. ఇకపై పదవి కావాలని అడుక్కోవడం ఉండదని నేరుగా సమయం వచ్చినప్పుడు సీఎం సీట్లో కూర్చోవడమే ఉంటుందని హెచ్చరించారు. కచ్చితంగా తనకు మంచి పదవి వస్తుందని కూడా నమ్మకం వ్యక్తం చేశారు. ఇలా మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజున ఇలాంటి అసంతృప్తి స్వరం వినిపించడంపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం కూడా సీరియస్‌గా ఉంటోంది. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటాను అంటూ గతంలో రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌పై కూడా ఇలానే రాజగోపాల్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. ఇది కాంగ్రెస్ రూల్స్‌కు విరుద్ధమని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చే ప్రయత్నాలు ఉన్నాయని ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. గత ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణ టైంలో కూడా విమర్శలు చేశారు. ఆస్తులు అమ్మి పార్టీని గెలిపిస్తే తనను మోసం చేశారని మండిపడ్డారు. తనతోపాటు వచ్చిన వారికి మంత్రిపదవులు ఇచ్చారని తనను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటేనే రాజగోపాల్ రెడ్డికి పడటం లేదు. ఆయన వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన వ్యక్తిని నేరుగా సీఎం సీటులో కూర్చోబెట్టడాన్ని తప్పుపడుతున్నారు. అందుకే సమయం వచ్చినప్పుడల్లా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటుంది రేవంతే అనే భావనలో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. అధిష్ఠానం వద్ద ఏదో ఒకటి చెప్పి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నారు. అందుకే సందర్భం ఏదైనా సరే రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే నీ కుర్చీ లాక్కుంటా అంటూ రేవంత్ రెడ్డికే పరోక్షంగా సవాల్ చేస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి పార్టీ రాష్ట్ర నాయకత్వానికి తలనొప్పిగా మారుతోంది. ఓవైపు రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జీవన్ రెడ్డి, ఇంకో వైపు జగ్గారెడ్డి లాంటి వాళ్లతో సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి విమర్శలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారతాయని రాష్ట్ర నాయకత్వం ఎన్ని రకాలుగా చెబుతున్నా వీళ్లు మాత్రం తమ పంథం వీడటం లేదు. సోదరుడు వెంకట్‌రెడ్డి కేబినెట్‌లో ఉండగానే రాజగోపాల్ రెడ్డికి పదవి ఎలా లభిస్తుందని పార్టీలోని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. స్కూల్ పిల్లాడి మాదిరిగా మారం చేస్తున్నారని అంటున్నారు.

# మసాజ్ ముసుగులో వ్యభిచారం

**హైదరాబాద్** మసాజ్ సెంటర్ ముసుగులో సాగుతున్న వ్యభిచార ముఠా గుట్టును కేపి.హెచ్ బి పోలీసులు రట్టు చేశారు. స్థానిక అసాన వెల్ నెస్ స్పా సెంటర్పై అకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 15 మంది యువతులను రక్షించడంతో పాటు, నిర్వాహకులు, విటులు కలిపి మొత్తం 30 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసాన వెల్ నెస్ స్పాలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. మగవారికి ఆడవారితో క్రాస్ మసాజ్ చేస్తామంటూ యువతులను రప్పించి, వారి ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మసాజ్ సెంటర్ లోపల ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దాడుల్లో వెల్లడైంది.

## ఇంద్రకీలాద్రిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్

# ప్రతులకు ప్రత్యేక పూజలు

**విజయవాడ** రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, నేడు ఉదయం రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ వారి పాదాల చెంత బడ్జెట్ ప్రతులను ఉంచి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీయూష్ కుమార్ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ, డి. రోనాల్డ్ రోస్ కార్యదర్శి, ఆర్థిక శాఖ, సూరజ్ గనోరే, గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన అధికారులకు ఆలయ ఈవో శీనా నాయక్ ఘనస్వాగతం పలికి, వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అర్చకులు బడ్జెట్ ప్రతులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం అధికారులకు తీర్థప్రసాదాలు అందజేశారు.దర్శనం అనంతరం అధికారులకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ నిర్విఘ్నంగా అమలు కావాలని అధికారులు ఈ సందర్భంగా ప్రార్థించారు.

## సూర్యప్రభవాహనంపై

# శ్రీ సూర్యనారాయణస్వామి అభయం

**– పరవశించిన భక్త జనం – ఫిబ్రవరి 15న రథోత్సవం**

శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం 8 గంటలకు ఆదిత్య మండలం సూర్యప్రభ వాహనంపై ఖడ్గం, గద, విల్లు ధరించి శ్రీ సూర్యరాయణస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆయురారోగ్యప్రాప్తి :**

సూర్యుడు సకల రోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్య మండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.వాహన సేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఫిబ్రవరి 15న రథోత్సవం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన ఆదివారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 6.30 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 7.45 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

డీసీఎం ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణంతెలంగాణ : నల్గొండ జిల్లా చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మునుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ షేక్ తయ్యూబ్ (30) మృతిచెందాడు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో విధులు ముగించుకుని స్వగ్రామం నకిరేకల్‌కు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తయ్యూబ్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందిన వెంటనే నల్లగొండ రూరల్ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# కాంగ్రెస్ పతనానికి ఎమ్మెల్యే సంజయే కారణం

**కరీంనగర్** కురు సామ్రాజ్య పతనానికి శకుని ఏ విధంగా కుట్రపూరితంగా దోహదపడ్డాడో.. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ పతనానికి.. ఎమ్మెల్యే సంజయ్ కారకుడు అయ్యాడని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాలలో 40 స్థానాలు గెలుస్తామనుకుంటే.. 20–22 స్థానాలకి పరిమితమైంది. ఇప్పటికైనా మాకు స్వేచ్ఛ ఇవ్వండని కాంగ్రెస్ పార్టీ అధిష్టానికి వేడుకుంటున్నానని అన్నారు.

## తెలంగాణలో మొదలైన

# అసలైన రాజకీయం

**హైదరాబాద్,** రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు వింత పరిస్థితిని తెచ్చిపెట్టాయి. మెజారిటీ చోట్ల కాంగ్రెస్ జెండా ఎగిరినప్పటికీ, సుమారు 12 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' ఏర్పడింది. ఇప్పుడు ఈ మున్సిపాలిటీల్లో పీఠాన్ని దక్కించుకోవాలంటే స్వతంత్ర అభ్యర్థుల మద్దతు అనివార్యంగా మారింది.సాధారణంగా గెలిచిన స్వతంత్రులను తమవైపు తిప్పుకోవడానికి పార్టీలు భారీ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఈసారి సీన్ రివర్స్ అయ్యింది. "మద్దతు కావాలంటే మాకే చైర్మన్ పదవి ఇవ్వాలి" అంటూ స్వతంత్రులు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన సీనియర్లను కాదని, బయటి వ్యక్తికి చైర్మన్ పదవి ఎలా ఇవ్వాలో తెలియక కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

**క్యాంపు రాజకీయాలు:**

అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు పార్టీలు ఇప్పటికే 'క్యాంపు' రాజకీయాలకు తెరలేపాయి. గెలిచిన వారిని రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు.అలియాబాద్ (మేడ్చల్ జిల్లా): ఇక్కడ 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7 స్థానాలు సాధించాయి. ఒక్క సీటు గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థి గాదె వెంకటేష్ ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారారు. చైర్మన్ పదవి ఇచ్చే పార్టీకే నా మద్దతు అని ఆయన తేల్చి చెప్పారు.జనగామ: ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ బలబలాలు సమానంగా ఉండటంతో, స్వతంత్ర అభ్యర్థి పాండు కోసం రెండు పార్టీల నేతలు బాహాబాహీకి దిగారు. తనను చైర్మన్ చేస్తామంటేనే వస్తానని ఆయన షరతు విధించడం విశేషం.ఒకవేళ భారీ ఆఫర్లు ఇచ్చి స్వతంత్రులకు చైర్మన్ పదవి కట్టబెట్టినా, వారు తర్వాత వేరే పార్టీలోకి జంప్ అయితే పరిస్థితి ఏంటన్నది పార్టీల ఆందోళన. ప్రస్తుతం ఈ 'హంగ్' మున్సిపాలిటీల్లో గెలిచిన అభ్యర్థులకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో, రాజకీయ సమీకరణాలు గంటగంటకూ మారుతున్నాయి. మరో వైపు కేవలం గద్వాల మాత్రమే కాకుండా వర్ధన్నపేట, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ ఇదే తరహాలో అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పోలీసులతో బెదిరించి బలవంతంగా తమ పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ వేధింపులు ఉన్నప్పటికీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 16 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టమైన మెజారిటీతో నేరుగా పీఠాలను కైవసం చేసుకుంటోందని వెల్లడించారు.మరో 10 నుంచి 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ 'లార్జెస్ట్ పార్టీ' (అత్యధిక సీట్లు సాధించిన పార్టీ)గా అవతరించిందని తెలిపారు.భయంతోనే కాంగ్రెస్ అక్రమ మార్గాలను ఎంచుకుందని, తమ అభ్యర్థులను లాక్కునే ప్రయత్నాలను అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# అంగరంగ వైభవంగా యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి భవాని శంకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల ఫిబ్రవరి 18వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాలలో స్వామివారి బ్రహ్మోత్సవాల గురించి పెద్ద ఎత్తున ప్రచార నిర్వహిస్తున్నామని అన్నారు. కరపత్రాలు పోస్టర్లు ఆర్చీల ద్వారా ఇతర ప్రకటన ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచార నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టాలైన స్వామివారి ఎదుర్కోల్లు ఈనెల 24వ తేదీన జరగనున్నాయని తెలిపారు. అదే విధంగా 25వ తేదీన స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం, 26వ తేదీన స్వామివారి దివ్య విమాన రథోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టాలైన స్వామివారి కల్యాణ మహోత్సవం స్వామి వారి రథోత్సవ కార్యక్రమాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే వీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వీఐపీలతో పాటు సామాన్య భక్తులకు స్థానికులకు స్వామివారిని దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఇక్కడికి వచ్చే భక్తులకు స్వామివారి పులిహోర లడ్డు ప్రసాదాలను సరిపోయే విధంగా భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాటల్లో భాగంగా పారిశుధ్యం ఇతరత్న అన్ని కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లైటింగ్ సౌండ్ సిస్టంను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ పరిసరాలలో పెద్ద ఎత్తున ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దూరంగా ఉండే భక్తులు సైతం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని దగ్గరగా వీక్షించేందుకు



ఎల్ఈడి స్క్రీన్ లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు, స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వంశపారంపర్య ధర్మకర్త భాస్కరరాయణి నరసింహమూర్తి, డిఇఓ దోర్భలభాస్కర్ శర్మ, ఏఈఓ రఘు బాబు, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్ర చార్యులుతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జైల్లో క్షీణిస్తున్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం

## – మాజీ క్రికెటర్ల ఆందోళన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం విషయంలో పాక్ మాజీ క్రికెటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జైలులో అనారోగ్యంతో బాధపడుతున్న తమ 'కెప్టెన్'కు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయాలను పక్కనపెట్టి, ఒక జాతీయ హీరోగా ఇమ్రాన్‌కు దక్కాల్సిన గౌరవం, వైద్యం అందించాలని వసీం అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్ వంటి మాజీ స్టార్లు సోషల్ మీడియా వేదికగా గళమెత్తారు. అసలేం జరిగిందంటే, అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ తన కుడి కంటిలో 85 శాతం చూపును కోల్పోయినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. రక్తం గడ్డకట్టడం వల్ల 'సెంట్రల్ రెటినల్ వీన్ ఆక్లూజన్' అనే తీవ్రమైన సమస్య తలెత్తినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయనకు కేవలం 15 శాతం దృష్టి మాత్రమే మిగిలి ఉందని తెలియడంతో ఆయన అభిమానులు, క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. 2023 సెప్టెంబర్ నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచే కంటి సమస్యలతో బాధపడుతున్నా, జైలు అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పాకిస్థాన్ సుప్రీం కోర్టు దృష్టికి వెళ్లడంతో, కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వార్త తెలియగానే పాక్ క్రికెటర్లు స్పందించారు. "రాజకీయాలను పక్కన పెట్టి చూస్తే.. ఆయన మా జాతీయ హీరో. 1992 ప్రపంచ కప్ గెలిపించారు. క్యాన్సర్ హాస్పిటల్ కట్టించారు. అలాంటి వ్యక్తికి సరైన చికిత్స అందించాలి" అని వకార్ యూనిస్ భావోద్వేగంగా కోరారు. షాహిద్ అఫ్రిది, రమీజ్ రాజా వంటి అనేక మంది మాజీ ఆటగాళ్లు కూడా మానవతా దృక్పథంతో స్పందించి, మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రస్తుతం ఇమ్రాన్‌ను మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

## – ఫిబ్రవరి 17న ఢాకాలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. "చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రకటనలో పేర్కొంది.

ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక 'ప్రొథోమ్ ఆలో' కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు. ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





# క్వింటాల్ మిరప రూ.87,786

**అనంతపురం,** అనంతపురం జిల్లాలో ఓ మిరప రైతు పంట పండింది. వజ్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే మిరప రైతు డబ్బీ డ్రై మిరపను పండించారు. ఈ మిరప పంటను కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్ తరలించగా.. మార్కెట్లో గురువారం రికార్డు స్థాయి ధర పలికింది. క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.87,786 పలికింది. దీంతో రైతును మార్కెట్ అధికారులు, వ్యాపారులు, తోటి రైతులు సన్మానించారు. పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. జిల్లాకు చెందిన ఓ మిరప రైతు పంట పండింది. రాయదుర్గం మండలంలోని వజ్రవన్నూరుకు చెందిన తిప్పేస్వామి అనే రైతు పండించిన మిరపకు రికార్డు ధర లభించింది.

తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరప.. రికార్డు స్థాయిలో క్వింటాల్ ధర రూ.87,786 పలికింది. కర్ణాటకలోని హావేరి జిల్లాలో ఉన్న బ్యాడిగి వ్యవసాయ మార్కెట్‌లో తిప్పేస్వామి పండించిన డబ్బీ డ్రై మిరపకాయలు .. ఈ రికార్డు ధర పలికాయి. దీంతో తోటి రైతులు, మార్కెట్ అధికారులు, వ్యాపారులు తిప్పేస్వామికి సన్మానం చేశారు. నాణ్యమైన మిరప పండించారంటూ పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించారు. వజ్రవన్నూరు రైతులు సుమారు 2 టన్నుల మిరపను బ్యాడిగి మార్కెట్‌కు తరలించారు. మంచి ధర పలకటంతో మిరప రైతులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు గత రెండేళ్లుగా మిరప రేట్లు చతికిలపడ్డాయి. ఇటీవల మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మిరప రైతులు సంతోషంలో ఉన్నారు. మిరపలో రకాన్ని అనుసరించి రెండేళ్లతో పోలిస్తే ఈ సారి నాణ్యత ప్రకారం ఒక్కో రకం మిరప రూ.7000 నుంచి రూ.8000 వరకూ పెరిగింది. దీంతో రైతులు ఆశగా ఉన్నారు. మిర్చి ధరలు నేలచూపులు చూడటంతో రెండు ఏళ్లుగా రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి మిరప సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి చూపించలేదు. దీంతో ఉత్పత్తి తగ్గింది. దీనికి తోడు మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలోనూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. దీంతో మిరప పంట దిగుబడి మరింత తగ్గింది. దీంతో ఈసారి మిరపకు డిమాండ్ పెరుగుతుందని వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.

### డబ్బీ డ్రై మిరపకాయలకు ఎందుకింత డిమాండ్..

మరోవైపు డబ్బీ డ్రై మిరపకాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని కర్ణాటకలోని బ్యాతగిరి ప్రాంతంలో ఎక్కువగా పండిస్తారు. నాణ్యమైన, మంచి రంగును కలిగి ఉంటాయి. తక్కువ కారం, ఎక్కువ సువాసన ఉండటంతో డబ్బీ డ్రై మిరపకాయలకు డిమాండ్ ఎక్కువ. డబ్బీ డ్రై మిరపకాయల పొడిని సాంబార్, పచ్చళ్ల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. వీటిలో కూడా ఏ, ఏప్లస్ గ్రేడ్ అనే రెండు రకాలు ఉంటాయి. సాంబార్, మసాలా పొడులు, చట్నీలలో ఎక్కువగా ఈ మిరపకాయల పొడిని ఉపయోగిస్తుంటారు. సాధారణ మిరపకాయలతో పోలిస్తే ముదురు ఎరుపు రంగంలో కాస్త లావుగా ఉండటంతో పాటుగా డబ్బా ఆకారంలో ఉండటంతో వీటికి ఆ పేరు వచ్చింది.

# కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు.. ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు



బెంగళూరు: కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కర్ణాటకలోని మాండ్య జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2022లో కీర్తి కెమికల్స్ నుంచి విషపూరిత వాయువు లీకేజీ వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలగడంతోపాటు పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారుల జోక్యంతో ఫ్యాక్టరీని మూసివేయాలని యజమానులు నిర్ణయించారు. కాగా, చాలా కాలంగా పని చేయని ఈ కెమికల్ ఫ్యాక్టరీలోని సామగ్రిని వేరే ప్రదేశానికి తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రసాయన ట్యాంక్ తొలగించేందుకు ప్రయత్నించగా పేలుడు జరిగింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించగా మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన కార్మికులు బీహార్‌కు చెందిన వారని పోలీసులు తెలిపారు. ఈ పేలుడుపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఆదిలాబాద్ జడ్జి



జూలూరుపాడు : మహాశివరాత్రి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామంలో ప్రసిద్ధ స్వయంభూ క్షేత్రమైన శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి వారిని ఆదిలాబాద్ జిల్లా జడ్జి కాళ్లూరు ప్రభాకర్ రావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వి.ఎల్. వెంకట్రావు, ప్రధాన పౌరోహితులు తెలికిచర్ల మధు కుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో జడ్జి ప్రభాకర్ రావు ప్రత్యేక అభిషేకాలు, గోత్రనామార్చనలు తదితర విశేష పూజలు నిర్వహించారు. ?మండలంలోని శైవ క్షేత్రాలు, ఇతర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాకర్ల గ్రామం సమీపాన పాలగుట్టపై స్వయంభూగా వెలసిన రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో శివరాత్రి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు.

# కేసీఆర్ జన్మదిన వేడుకలకు విస్తృత ఏర్పాట్లు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




హైదరాబాద్ : ఈ నెల 17 న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. తెలంగాణ వార్తలుతెలంగాణ భవన్‌లో ఇన్‌చార్జి రావుల చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్, కిషోర్ గౌడ్, ముఠా జయసింహతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తలసాని మీడియాతో మాట్లాడారు. కరెంట్, నీళ్ల గోస లేకుండా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ , పేదలకు ఆసరా పింఛన్లు, విద్యార్థులకు గురుకులాలను, రైతులకు , ప్రజలకు సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చేసిన నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆలయాలు, చర్చిలు, మసీదులలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలను నిర్వహిస్తున్నామని వివరించారు. 17 న కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేక్ కటింగ్ కార్యాక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వెల్లడించారు. న్సిపల్ ఎన్నికలలో అధికార పార్టీకి ధీటుగా ప్రతి పక్ష బీఆర్ఎస్‌కు ఓట్లు వచ్చాయని అన్నారు.

# బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



రాజాపేట : బంజారాలలో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా రాజాపేట మండలంలోని పుట్టగూడంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ కి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, ఆలేరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు, నాయకులు రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, దేవులా నాయక్, రాణి, గన్యా, శ్రీనునాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి- సేవా భావాలే సమజాభివృద్ధికి మార్గం

**- ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు**

**- భాజపా సీనియర్ జిల్లా నేత, సామాజిక సేవకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా భాజపా సీనియర్ నాయకులు, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్, ప్రముఖ సామాజిక సేవకులు అనుమల్ల చంద్రమౌళి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తన నివాసంలో పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,మిత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనుమల్ల చంద్రమౌళి మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక చింతనకు, మనోనిగ్రహానికి ప్రతీక అని అన్నారు. పరమశివుడి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. యువత సన్మార్గంలో నడుచుకుంటూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. భక్తి, నీతి, సేవా భావాలతో జీవిస్తే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆయన పేర్కొంటూ, ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా సోమవారం రోజు న్యాయవాదుల విధుల బహిష్కరణ

**-తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్, తెలంగాణ రాష్ట్రం అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ నవూరి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన న్యాయవృత్తి గౌరవానికి, న్యాయపాలనకు, న్యాయవ్యవస్థకు నేరుగా జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 16 ఫిబ్రవరి సోమవారం నాడు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించాలని ఫెడరేషన్ నిర్ణయించినట్లు తెలిపారు. అదే రోజు ఉదయం 10:30 గంటలకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లలో సంతాప సమావేశాలు నిర్వహించబడతాయని చెప్పారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు ప్రధాన ద్వారాల ముందు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టి, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిందితులను అరెస్ట్ చేసి, వేగవంతమైన, నిష్పక్షపాత విచారణ జరిపి, దోషులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణమే అమలు చేయాలని కోరారు. అలాగే మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు, న్యాయవాదులు ఈ నిరసన కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొని ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

# మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఫాజుల్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండవేని తిరుపతి



వేములవాడ (ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండవేని తిరుపతి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పరమేశ్వరుని దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.భక్తి, నిష్ఠ, ధర్మపాలనతో జీవిస్తూ సమాజంలో సౌభ్రాతృత్వం, శాంతి, సౌఖ్యాలు విరాజిల్లాలని ఆకాంక్షించారు. మహాదేవుని కరుణాకటాక్షాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో కళకళలాడాలని కోరుకున్నారు.

# ఉప సర్పంచ్ తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా శివరాత్రి వేడుకలు

**- శివాంజనేయ స్వామివారి ఆలయంలో భక్తి శ్రద్ధలతో శివ పార్వతుల కళ్యాణం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం అనంతపల్లి గ్రామంలోని శివాంజనేయ స్వామివారి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. పలువురు దాతల సహకారంతో, గ్రామ ఉప సర్పంచ్ గొడిశెల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీ శివపార్వతుల కళ్యాణఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, పళ్ళను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గొడిశెల తిరుపతి గౌడ్ మాట్లాడుతూ,"మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆలయంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గ్రామ ప్రజలంతా ఐక్యంగా సహకరించడం ఆనందంగా ఉంది. స్వామివారి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.

# తమిళనాడులో త్రిష.. తెలంగాణలో రకుల్

## - రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు ఎందుకు.?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అమ్మ, ఆలి, చెల్లి.. ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో.? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని, ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.

**- తమిళనాడు రాజకీయాల్లో త్రిష.. వాడివేడిగా విమర్శలు - ఎందుకిలా.?**

త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం. తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి. భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది.

**- హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు.?**

రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా.? సినిమాల్లో విజయ్, త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు.? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు.? తమిళనాడులో త్రిష.. తెలంగాణలో రకుల్.. రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# శివనామ స్మరణతో మారుమ్రోగిన వేములవాడ

**- దక్షిణకాశీ వేములవాడలో మహాశివరాత్రి మహోత్సవాల వైభవం**

**- భక్తి, భక్తుల సందోహంతో కళకళలాడిన శ్రీ భీమేశ్వర ఆలయం**

**- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించిన అధికారులు**







వేములవాడ (ప్రశ్న న్యూస్) దక్షిణకాశీగా ఖ్యాతి గాంచిన వేములవాడలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు, పురవీధులన్నీ "ఓం నమఃశివాయ" నినాదాలతో మారుమ్రోగి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆలయ అధికారుల అంచనా ప్రకారం ఇప్పటివరకు దాదాపు లక్షన్నర మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కుటుంబ సమేతంగా భక్తులు తండోపతండాలుగా చేరుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. కోడె మొక్కులు, తలనీలాల సమర్పణలు, ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు .శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, లింగాభిషేకాలు, మహామంగళహారతులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలంకరణలతో మెరిసిపోగా, భక్తుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో తాగునీరు, ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు సమకూర్చి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, పోలీసు శాఖ, రెవెన్యూ, వైద్య, విద్యుత్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేశాయి. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేయడంతో రాకపోకలు సజావుగా సాగాయి. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించడం విశేషం. స్థానిక వ్యాపారులు,ట్రస్టులు అన్నదాన సేవలు, పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. అన్నదాన శిబిరాల్లో వేలాది మంది భక్తులకు భోజన వసతి కల్పించారు. భక్తుల రాకతో వేములవాడ పట్టణం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. మొత్తం మీద ఈ ఏడాది మహాశివరాత్రి వేడుకలు వేములవాడ క్షేత్రంలో భక్తి పారవశ్యానికి నిదర్శనంగా నిలిచాయి. శివనామ స్మరణతో మారుమ్రోగిన దక్షిణకాశీ మరోసారి తన ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుకుంది.

# బొల్లారం 2వ వార్డులో పారిశుద్ధ్యంపై వివాదం

**- స్వయంగా డ్రైనేజీలు శుభ్రం చేసిన వార్డు సభ్యుడు : తోకల రమేష్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, బొల్లారం గ్రామం 2వ వార్డులో పారిశుద్ధ్య సమస్యలు వివాదానికి దారితీశాయి. గత కొన్ని రోజులుగా వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానిక 2వ వార్డు సభ్యుడు తోకల రమేష్ సర్పంచ్ సౌజన్య--మల్లిఖార్జున్‌లను పలుమార్లు కోరినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం దృష్ట్యా డ్రైనేజీల శుభ్రతపై మరోసారి దృష్టికి తీసుకెళ్లగా, సర్పంచ్ భర్త,స్థానిక 7వ వార్డు సభ్యుడు మల్లిఖార్జున్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని రమేష్ ఆరోపించారు. "గత రెండేళ్లుగా లేని సమస్యకు ఇప్పుడే పరిష్కారం కావాలా? ఎవరికి ఫిర్యాదు చేస్తావో చేసుకో" అంటూ స్పందించినట్లు తెలిపారు.ఈ పరిణామాల నేపథ్యంలో అవాక్కైన రమేష్ స్వయంగా వార్డులోని డ్రైనేజీలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "నేను వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు, నా వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కోరాను. కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత నా వార్డులోని మోటార్ మరమ్మతుల కోసం మల్లిఖార్జున్ అభ్యర్థన మేరకు రూ.4 వేలు సర్దుబాటు చేశాను. అయినప్పటికీ ఇలా స్పందించడం సరైంది కాదు"

# కడప, బెంగళూరు కొత్త రైల్వే లైన్




**కడప,** ఏపీలో కొత్త రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్రానికి రిక్వెస్ట్ వెళ్లింది. కడప నుంచి బెంగళూరుకు కొత్త రైలు మార్గంపై రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రైల్వే లైన్ రాయలసీమ అభివృద్ధికి కీలకమైనదని పురందేశ్వరి వివరించారు. ఈ రైల్వే లైన్‌పై సమీక్ష చేసి పనుల్ని వేగవంతం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుపై పలు కీలక అంశాలను ప్రస్తావించారు.ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే ప్రాజెక్టులపై ఎంపీల నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళుతున్నాయి. తాజాగా మరో కొత్త రైల్వే ప్రాజెక్టుపై రైల్వేమంత్రికి రిక్వెస్ట్ అందజేశారు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి. రాయలసీమకు కీలకమైన కడప-బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఈ రైలు మార్గం రాయలసీమ ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకమైనదని పురందేశ్వరి అన్నారు. ఈ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి పునఃసమీక్షించి, పనులను వేగవంతం చెయ్యాలని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఏపీ రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ కూడా పురందేశ్వరి వెంట ఉన్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2008లో మంజూరు చేశారని.. మొత్తం 266 నుంచి 268 కి.మీ చేపట్టాల్సి ఉండగా.. కేవలం కడప-పెండ్లిమర్రి మధ్య 21 కిలోమీటర్లు మాత్రమే పనులు పూర్తి చేశారన్నారు. ఈ రైల్వే లైన్ ద్వారా కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు.రాయలసీమ అభివృద్ధికి అత్యంత కీలకమైన కడప?బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును పరిశీలించి, త్వరితగతిన అమలు చేయాలని గౌరవ రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారిని కోరడం జరిగింది. 2008లో ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు ఇప్పటివరకు పరిమిత పురోగతితోనే కొనసాగుతోంది. జిల్లాలైన కడప, అన్నమయ్య ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ రైల్వే లైన్ ఎంతో కీలకం. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్‌కు ఊతం, బెంగళూరుతో నేరుగా రైల్వే అనుసంధానం, పరిశ్రమలు వృద్ధి, విద్యార్థులు, రోగులు, ఉద్యోగార్థులకు సౌలభ్యం, పర్యాటకాభివృద్ధి ఉ ఉపాధి అవకాశాలు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వంతో వ్యయ భాగస్వామ్య విధానాన్ని మళ్ళీ పరశీలించి, సమన్వయం చేసి, తగిన సమయంలో పూర్తి చేయాలని కోరడం జరిగింది' అని పురందేశ్వరి పోస్ట్ చేశారు.ఈ కడప- బెంగళూరు మార్గాన్ని పులివెందుల మీదుగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముద్దనూరు-పులివెందుల- ముదిగుబ్బ- శ్రీసత్యసాయి మధ్య రూ.2,505 కోట్లతో 110 కి.మీ మేర లైన్‌కు సంబంధించి అడుగులు పడుతున్నట్లు రెండు నెలల క్రితం చర్చ జరిగింది. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే బెంగళూరు త్వరగా చేరుకోవచ్చు



# లొకేషన్‌లో వాగ్వివాదం

షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాధృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రెడ్ కార్పెట్‌పై ఫోటోగ్రాఫర్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆయేషా ఖాన్ ..

## - వెనక నుండి పిక్స్ తీయోద్దు..



డ్యాన్సింగ్ క్వీన్‌గా పేరుగాంచిన ఆయేషా ఖాన్ ఓ ఫోటోగ్రాఫర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ముంబైలో జరిగిన ఎబ్ఘ మీుఅఅ స్పెషల్ స్క్రీనింగ్ సందర్భంగా ఈ ఘటన జరిగింది. స్క్రీనింగ్‌కు హాజరైన ఆయేషా రెడ్ కార్పెట్‌పై ఫోటోలకు పోజులు ఇస్తుండగా, కొందరు ఫోటోగ్రాఫర్లు ఆమెను వెనుక వైపు నుంచి వీడియో తీయడానికి ప్రయత్నించారు. ఇది గమనించిన ఆమె వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ వారిని సున్నితంగా హెచ్చరించారు. "ఆప్ ఇజ్జత్ ఖుద్ కమాయేంగే, ఔర్ ఖుద్ హీ గవ్వాయేంగే... ప్లీజ్ మత్ కరియే, అచ్ఛా నహీ లగ్తా" అంటూ హిందీలో వ్యాఖ్యానించారు. అంటే "గౌరవాన్ని మీరే సంపాదించుకుంటారు... మీరే కోల్పోతారు... దయచేసి ఇలా చేయకండి, ఇది మంచిది కాదు" అనే అర్థం. ఆమె వ్యాఖ్యలు అక్కడున్న వారిని కాసేపు ఆలోచింపజేశాయి.(సోషల్ మీడియా యుగంలో సెలబ్రిటీల వ్యక్తిగత గోప్యతను పట్టించుకోకుండా అసభ్యకర యాంగిల్స్‌లో ఫోటోలు తీయడం పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా ఆయేషా స్పందిస్తూ "ఊప్స్ మూమెంట్స్ కోసం వెతకడం సరైంది కాదు" అని అభిప్రాయపడింది. ఆమె ఆగ్రహం వ్యక్తం చేసిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ఫోటోగ్రాఫర్లు కూడా మద్దతుగా నిలవడం విశేషం. సోషల్ మీడియాలోనూ నెటిజన్లు ఆయేషాకు మద్దతు తెలుపుతూ "సెలబ్రిటీలకు గౌరవం ఇవ్వడం నేర్చుకోండి" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ స్క్రీనింగ్‌కు అనన్యా పాండే, ఖుషీ కపూర్, అనిల్ కపూర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం ఆయేషా ఖాన్ వరుస ఆఫర్లతో బిజీగా ఉండగా, టాలీవుడ్ మరియు బాలీవుడ్ ప్రాజెక్టులతో కెరీర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. అయేషా ఖాన్ ప్రస్తుతం వరుస ఆఫర్లతో బిజీగా ఉంది. తెలుగులో కూడా పలు చిత్రాలు చేస్తుంది. రామ్ చరణ్ -- బుచ్చిబాబు చిత్రం పెద్దిలో అయేషా ఒక కీలక పాత్రకు ఎంపికైనట్లు సమాచారం.. డిజే టిల్లు ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ సినిమాలోను అయేషా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. మరోవైపు బాలీవుడ్ లో పలు చిత్రాలతో అయేషా బిజీ బిజీగా ఉంది.

# ధీర వనిత 'సరస్వతి'



విభిన్న పాత్రల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది వరలక్ష్మి శరత్‌కుమార్. ఆమె స్వీయ దర్శకత్వంలో సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి నటిస్తున్న చిత్రం 'సరస్వతి'. థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. తాజాగా అగ్ర హీరోయిన్ సమంత ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.సరికొత్త కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో సరస్వతి పాత్రలో వరలక్ష్మి శరత్‌కుమార్ అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుందని, ఎలాంటి పరిస్థితినైనా ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యవంతురాలైన మహిళగా ఆమె కనిపిస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిందని, త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. జీవా, ప్రకాష్‌రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: పూజా శరత్‌కుమార్, వరలక్ష్మి



# మనుగడను మార్చే శాసనం


సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ యామిని ఈఆర్‌ని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ రూపొందుతున్న ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ 'క్వీన్'. రతన్ రిషి దర్శకుడు. వన్ సర్కిల్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతున్నది. వాలెంటైన్స్‌డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు.

ఈ టైటిల్ గ్లింప్స్‌ని చూస్తే ప్రస్తుత సమాజంతో ముడిపడివున్న ఒక ఆసక్తికరమైన ప్రేమకథని చూపిస్తున్నట్టు తెలుస్తున్నది. రాళ్లమీద పేర్లతో కొన్ని ప్రేమకథలు మిగిలిపోతాయి. తాజ్‌మహల్ వంటి గుర్తులుగా మరికొన్ని ప్రేమకథలు నిలిచిపోతాయి. కానీ ఈ ప్రేమకథ దేశపు మనుగడను మార్చే ఓ కొత్త శాసనం.. అని చెబుతూ భారత రాజ్యాంగాన్నీ, ఆర్‌టీఐ యాక్ట్, పీపుల్ సెంట్రిక్ గవర్నమెంట్ సిస్టమ్, యాక్ట్ ఆఫ్ లవ్ వంటివి గ్లింప్స్‌లో చూపించడం 'క్వీన్' సినిమాపై ఆసక్తి కలిగించింది.తాను ప్రేమించిన వ్యక్తి కలను నిజం చేస్తూ, అతని కలకు చట్టబద్ధమైన గుర్తింపు తెచ్చేందుకు ఓ అమ్మాయి చేసిన పోరాటమే ఈ సినిమా కథ అని దర్శకుడు రతన్ రిషి చెప్పారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్‌ఘోష్, భాయ్ నవీన్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సరన్, సంగీతం: యతీష్.



# పెళ్లిపై మృణాల్ ఠాకూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఉత్తరాది భామ మృణాల్ ఠాకూర్ టాలీవుడ్, కోలీవుడ్ లో కూడా ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు, మృణాల్ పెళ్లి గురించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. తమిళ స్టార్ ధనుష్ ను ఆమె పెళ్లాడబోతోందంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. అలాంటిది ఏమీ లేదని ఆమె స్పష్టంగా చెప్పినప్పటికీ... ఈ పుకార్లకు చెక్ పడలేదు. ఈ అంశంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో మృణాల్ స్పందిస్తూ... పెళ్లి అనేది జీవితంలో ఒక అందమైన మలుపు అని... తాను కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పింది. పెళ్లి చేసుకోవాలంటే సరైన వ్యక్తి, సరైన సమయం కావాలని తెలిపింది. ఎవరో అడుగుతున్నారనో, వయసు పెరిగిపోతోందనో తొందరపడి నిర్ణయం తీసుకోనని చెప్పింది. తన మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే... ఆ విషయాన్ని తానే స్వయంగా ప్రకటిస్తామని తెలిపింది. ఒక వ్యక్తితో జీవితాంతం కలిసి ఉండాలంటే మనసులు కలవాలని మృణాల్ అభిప్రాయపడింది. బలవంతపు బంధాల కంటే... ఇష్టమైన వ్యక్తి కలిసేంత వరకు వేచి ఉండటమే మేలని చెప్పింది. సినిమాల విషయానికి వస్తే... 'దో దినావే సెహర్ మే' స ి ని వ ా త ో అలరించనుంది. టాలీవుడ్ లో అడివి శేష్ తో క ల ి సి న న టి ం చి న



యువహీరో సుమంత్ ప్రభాస్ లీడ్‌రోల్ చేస్తున్న రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'. నిధి ప్రదీప్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుభాష్‌చంద్ర దర్శకుడు. అభినవ్‌రావు నిర్మాత. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ వేగవంతం చేశారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా రెండోపాటను శనివారం విడుదల చేశారు. 'ఓ మై గాడ్' అంటూ సాగే ఈ పాటను వెంగీ రాయగా, నాగవంశీకృష్ణ స్వరపరిచారు. గానాబాలా ఆలపించారు. అర్థంకాని అమ్మాయిల మనస్తత్వాన్ని ఆవిష్కరించేలా ఈ పాట సాగింది. విజయ్ పోలాకి ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జగపతిబాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవిప్రసాద్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయి సంతోష్, నిర్మాణం: రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్.

# గోదారి గట్టుపైన స్వరాలు

## వైవిధ్య కథాంశాల

# దర్శకునితో సిద్ధు?



ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ'ఫేం స్వరూప్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. అలాగే 'బ్యాడ్ యాజ్', 'కోహినూర్' సినిమాలైతే స్క్రిప్ట్ దశలో ఉన్నాయి.

'టిల్లు క్యూబ్' కూడా త్వరలోనే పట్టాలెక్కనుంది. ఈ మూడూ సినిమాలూ సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తుండటం విశేషం. ఇదిలావుంటే.. ఇవిగాక మరో సినిమా కూడా సిద్ధు డైరీలో చేరినట్టు విశ్వసనీయ సమాచారం. శ్రీవిష్ణుతో 'రాజ రాజ చోర', 'స్వాగ్' చిత్రాలను తెరకెక్కించిన హసిత్ గోలీ దర్శకత్వంలో సిద్ధు ఓ చిత్రం చేయనున్నారట. ఇటీవలే సిద్ధుకీ హసిత్ ఓ వినోదాత్మక కథను వినిపించాడట. సిద్ధుకి కథ నచ్చిందట. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తారని టాక్. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ కాంబోకు చెందిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## కరీంనగర్ మేయర్ బరిలో వారాల నర్సింగం



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవికి కాంగ్రెస్ పార్టీ తరఫున వారాల నర్సింగం పేరు ప్రధానంగా వినిపిస్తోంది. గత మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధంగా కొనసాగుతున్న ఆయన, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకే అంకితమై పనిచేస్తూ వచ్చిన నర్సింగం, ఎన్నో సేవా కార్యక్రమాలు, స్వచ్ఛంద కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు,కేసులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పార్టీ కోసం కృషి చేశారు.యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతోంది. పార్టీ నాయకత్వంతో పాటు స్థానిక ప్రజల్లోనూ ఆయనకు మంచి పేరు ఉంది.మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్నిహితుడిగా, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు నమ్మకస్తుడిగా పేరున్న నర్సింగం మేయర్ బరిలో బలమైన అభ్యర్థిగా భావిస్తున్నారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆర్థిక,సామాజిక బలం ఉన్న ప్రత్యర్థిని 600 ఓట్ల మెజారిటీతో ఓడించి 21వ డివిజన్ నుంచి విజయం సాధించడం ఆయన ప్రజాదరణకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన నర్సింగం మేయర్ రేసులో కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులకు కన్నం సుదర్శన్ ఉచిత శిక్షణ

**- నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఉచిత శిక్షణా తరగతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామానికి చెందిన ఉన్నత విద్యావేత్త,అసిస్టెంట్ ప్రొఫెసర్,న్యాయవాది కన్నం సుదర్శన్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల వేదికపై ఇచ్చిన హామీ మేరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల కోసం ప్రతి ఆదివారం ఉచిత గురుకుల, నవోదయ, సైనిక్ కోచింగ్‌తో పాటు ఉచిత ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్నారు.ఇదిలా ఉండగా, 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఫిబ్రవరి 22న పరీక్ష నిర్వహించబడనున్న నేపథ్యంలో, సాధారణ ఆదివారం తరగతులతో పాటు రెండో శనివారం కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు మెరుగైన సన్నద్ధత సాధించే అవకాశముంది.ఈ నేపథ్యంలో గ్రామస్తులు సుదర్శన్ చర్యల పట్ల హర్షం వ్యక్తం చేసి, అభినందిస్తున్నారు.

## అమరుల స్ఫూర్తితో దేశసేవకై ముందుకు సాగుదాం

**- అంబేద్కర్ యూత్ సభ్యులు : కన్నం సుదర్శన్**

**- పుల్వామా అమరులకు అనంతపల్లి అంబేద్కర్ యూత్ నివాళి**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన సీఆర్‌పీఎఫ్ జవాన్ల స్మృతిని స్మరించుకుంటూ బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ--కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఈ దారుణ దాడిలో 40 మంది జవాన్లు అమరులైన విషయం తెలిసిందే.దేశ రక్షణలో తమ ప్రాణాలను అర్పించిన వీర సైనికుల త్యాగం చిరస్మరణీయమని, వారి సేవలు దేశ చరిత్రలో నిలిచిపోతాయని సభ్యులు పేర్కొన్నారు. అమరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు.దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, దేశభక్తి భావనతో ముందుకు సాగాలని కన్నం సుదర్శన్ పిలుపునిచ్చారు.

## యువత ధర్మం - సంస్కృతి పరిరక్షణలో ముందుండాలి

**- మాజీ ఎమ్మెల్సీ : చెన్నాడి సుధాకర్ రావు**

**- మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రావు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,కోరెం గ్రామంలోని శివాలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్ రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం పొందారు.ఆయన వెంట కోరెం సర్పంచ్ జంపుక మాధవి, మాజీ ప్యాక్స్ చైర్మన్ తీపిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ డబ్బు మమత--సృజన్ రెడ్డి, ఉప సర్పంచ్ స్వామిరెడ్డి, పులి హన్మాండ్లు,వన్నెల రమణా రెడ్డి, క్యాతం తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్ రావు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం భక్తి, నియమం, ఆత్మశుద్ధికి ప్రతీక అని అన్నారు. పరమశివుని కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందితే సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. యువత ధర్మం, సంస్కృతి పరిరక్షణలో ముందుండాలని సూచించారు.మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# శివనామ స్మరణనే ముక్తికి మార్గం

**- దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు శివరాత్రి**

**- శివరాత్రి జాగారం, ఉపవాసం ఎందుకు చేస్తారు**



మంథని( ప్రశ్న న్యూస్) ఒక శివుడికే కాకుండా దేవతలకు కూడా అత్యంత ప్రీతిపాత్రమైన దినము శివరాత్రి పర్వదినం. అందుకే శివరాత్రి పర్వదినాన ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ శివ నామ స్మరనతో మారుమోగుతాయి. మంథని పట్టణంలో ఎంతో ప్రాచుర్యం పొందిన శ్రీ ఓంకారేశ్వర, శ్రీ భిక్షేశ్వర, శ్రీ గౌతమేశ్వర, శ్రీ శీలేశ్వర - సిద్దేశ్వర స్వామి దేవాలయాల్లో ఆదివారం భక్తులతో కిటకిటలాడుతాయి. ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పవిత్ర గోదావరి నది తీరంలో భక్తులు పుణ్య స్థానాన్ని ఆచరించారు. భక్తులు శివారాధనలో లింగరూపంలో పూజిస్తారు. ప్రతి లింగంలోనూ శివుని జ్యోతి స్వరూపం వెలుగుతుంది. వీటిలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ప్రధానమైనవి. మహాశివరాత్రి పర్వదినాన శివాలయాల్లో భక్తుల భక్తిశ్రద్ధలతో శివుని దర్శించుకుంటారు. అభిషేకాలు, పూజలతో పరమశివుని ఆరాధిస్తారు. దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఈ విశిష్ట దినాన రోజంతా ప్రత్యేక పూజలు జరుపుతారు. రాత్రి కూడా దేవాలయాలు తెరిచే ఉంచుతారు . పూజలు, భజనలతో శివనామం మారుమోగుతుంటుంది. ఈ పర్వదినాన లింగాష్టకం, శివ పంచాక్షరి జపిస్తారు. దీపారాధన చేసి, భక్తిప్రపత్తులతో రుద్రాభిషేకం చేస్తారు. శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రోజంతా పరమేశ్వరుని ప్రార్థిస్తూ ఉపవాసం ఉండి రాత్రి జాగారం చేస్తారు. శివరాత్రి పర్వదినం రోజున ఉపవాసం ఉండడం, తెల్లవారే వరకు మెలుకువగా ఉండడం అంటే జాగారం. చేస్తే శివునికి అత్యంత ప్రీతిపాత్రులవుతారు.

### అసలు శివరాత్రి విశిష్టత ఏమిటి ?

శివరాత్రి రోజు ఉపవాసం ఎందుకుంటారు ? జాగారం ఎందుకు చేస్తారు ? జాగారం ఎవరు, ఎప్పుడు ప్రారంభించారు ? అంటే దానికి ఒక కథ ఉంది. అమృతం కోసం దేవదానవులు క్షీరసాగర మథనం చేశారు. అప్పుడు అమృతం కంటే ముందు హాలాహలం పుట్టింది. హాలాహలాన్ని అలాగే విడిచిపెడితే అది ముల్లోకాలనూ దహించేసే ప్రమాదం ఉండటంతో దేవదానవులందరూ భయాందోళనకు గురవుతారు . హాలాహలం బారి నుంచి లోకాలను రక్షించాలంటూ మహాదేవుడైన శంకరుడిని శరణు వేడుతారు. లోక రక్షణ కోసం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి అలా గరళకంఠుడయ్యాడు. హాలాహల ప్రభావానికి శివుడి కంఠం కమిలి నీలంగా మారడంతో నీలకంఠుడిగా పేరుపొందాడు. గరళాన్ని గొంతులో బంధించడం వల్ల అది శివునిలో విపరీతమైన తాపాన్ని కలిగిస్తుంది. ఆ తాపాన్ని తగ్గించుకోవడానికి క్షీరసాగర మథనంలో పుట్టిన చంద్రుడిని తలపై ఉంచుకుంటాడు. నిరంతర తాపోపశమనం కోసం గంగను కూడా నెత్తిన పెట్టుకున్నాడు.
అయినా శివుడిని హాలాహల తాపం ఇబ్బంది పెడుతూనే ఉంటుంది . అందుకే భక్తులు నిత్యం శివలింగానికి అభిషేకం చేస్తూ ఉంటారు. హాలాహలం మింగినప్పుడు దాని ప్రభావానికి శివుడు మూర్ఛిల్లుతాడు. ఆందోళన చెందిన దేవతలు శివుడికి మెలకువ వచ్చేంత వరకు జాగారం చేస్తారు. అందుకే ఏటా మాఘ బహుళ చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి రోజున భక్తులు ఉపవాసం ఉండి, జాగారం చేయడం అనాదిగా భక్తులు పాటిస్తున్నారు. జాగారం ఉన్న సమయంలో శివనామ సంకీర్తనతోనూ, జప ధ్యానాలతోనూ కాలక్షేపం చేస్తారు. ఇదంతా మహాశివరాత్రి పర్వదినానికి గల పౌరాణిక నేపథ్యం. నిజానికి శివారాధన పురాణాలకు ముందు నుంచే ఉనికిలో ఉంది. క్రీస్తు పూర్వం 3వేల సంవత్సరాల క్రితం సింధులోయ నాగరికత విలసిల్లిన కాలంలో శివుడిని పశుపతిగా ఆరాధించేవారు. క్రీస్తు పూర్వం 1500–1200 నాటికి చెందిన రుగ్వేద శ్లోకాలలో రుద్రుడి పేరిట శివుని ప్రస్తావన కనిపిస్తుంది. క్రీస్తు పూర్వం నాలుగో శతాబ్దికి చెందిన శ్వేతాశ్వతర ఉపనిషత్తులో శైవమత సిద్ధాంతాల ప్రస్తావన కనిపిస్తుంది. ఈ ఉపనిషత్తు భగవద్గీత కంటే పురాతనమైనది. అయితే ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న శైవారాధన పద్ధతులు, సంప్రదాయాలు మాత్రం క్రీస్తు పూర్వం 200 నుంచి క్రీస్తు శకం 100 సంవత్సరాల మధ్య ప్రారంభమైనవి. శివారాధనను మూర్తి రూపంలోను, లింగరూపంలోనూ పూజిస్తారు. లింగ రూపమే ప్రధానమైనది. ప్రతి లింగంలోనూ శివుని జ్యోతి స్వరూపం వెలుగుతుందని నమ్మకం. వీటిలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ప్రధానమైనవి. మహాశివరాత్రి పర్వదినాన శివాలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తుంది. అభిషేకాలు , పూజలతో పరమశివుని ఆరాధిస్తారు. దేశంలోని 12 శివుని ప్రసిద్ద ఈ విశిష్ట దినాన రోజంతా ప్రత్యేక పూజలు జరుపుతారు. రాత్రి కూడా దేవాలయాలు తెరిచే ఉంటాయి. పూజలు , భజనలతో శివనామం మారుమోగు తుంటుంది. ఈ పర్వదినాన లింగాష్టకం, శివ పంచాక్షరి జపిస్తారు. దీపారాధన చేసి , భక్తిప్రపత్తులతో రుద్రాభిషేకం చేస్తారు. శివపార్వతుల కల్యాణం చేస్తారు. రోజంతా పరమేశ్వరుని ప్రార్థనలతో , చింతనలో గడిపి , రాత్రి జాగారం చేస్తారు. శివరాత్రి పర్వదినానికి ఉపవాసం , జాగారం చేస్తే శివుని కృపకు పాత్రులు అవ్వడమే కాకుండా శివుని అనుగ్రహం పొందుతారు.

## ఆరోగ్యంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- శ్రీ ద్వారకామాయి హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో, కరీంనగర్‌కు చెందిన శ్రీ ద్వారకామయి హాస్పిటల్ సౌజన్యంతో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు 150 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం గ్రామాభివృద్ధికి పునాది అని అన్నారు. చిన్న అనారోగ్యాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామాల్లో నిర్వహించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజల కోసం మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కమటం రాజమహేందర్ పాల్గొన్నారు. ఆసుపత్రి తరఫున డాక్టర్ శ్రావ్య, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ రాథోడ్ వైద్య సేవలు అందించారు. మార్కెటింగ్ మేనేజర్ జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## విజయం శ్రీధర్ బాబు, శ్రీను బాబులదే

**- 11 వ వార్డు కౌన్సిలర్ గా 270 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన వోడ్నాల శ్రీనివాస్**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపాలిటీలో 13 వార్డులో 11 కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం వెనుక మంత్రి శ్రీధర్ బాబు, శీను బాబులపై ప్రజలకు ఉన్న నమ్మకమేనని 11వ వార్డ్ కౌన్సిలర్ వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. వారి అండతో మంథని మున్సిపాలిటీ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తానని, ముఖ్యంగా తను ఆదరించి కౌన్సిలర్ గా గెలిపించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 11వ వార్డు లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్ గా గెలుపొందిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తనను గెలిపించిన వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి పథంలో వార్డును తీసుకెళ్లడానికి కృషి చేస్తానన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను అభ్యర్థిగా ప్రకటించిన తన గెలుపుకు బాటలు వేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శ్రీను బాబు లకు తానెప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబుల సహకారంతో వార్డు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల్లో అత్యధికంగా 270 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు.

## రామంతపూర్ ఎలక్ట్రీషన్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ బాల్ రెడ్డి

**ప్రభుత్వం ప్రవేట్ ఎలక్ట్రిషన్ ను ఆదుకోవాలి**

**ప్రభుత్వం ఎలక్ట్రిషన్లకు ఉచిత వైద్యం అందించాలి**



ఉప్పల్ ( ప్రశ్న న్యూస్) రామంతపూర్ డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడుగా కొండ బాల్ రెడ్డి ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎలక్ట్రిషన్ పనులు చేసే వారికి ఉచిత వైద్యం అందించాలని, ప్రైవేటు ఎలక్ట్రిషన్ గా పనిచేసే ఎలక్ట్రిషన్ లను ప్రభుత్వం ఆదుకోవాలని, లేబర్ కార్డుల పై ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎలక్ట్రిషన్ సభ్యుల సమస్యల పై స్పందిస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిషన్ ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, యాదవ్, కోశాధికారిగా రవి చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవీందర్ సింగ్, సోషల్ మీడియా అడ్వైజర్ గా అశోక్, రమేష్, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, మాలాద్రి ముఖ్య సలహాదారులుగా శ్రీశైలం, జాకీర్ హుస్సేన్,ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామంతపూర్ యూనియన్ మాజీ అధ్యక్షులు గణేష్ గౌడ్, మాజీ కోశాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎలక్ట్రిషన్ సభ్యులకు బ్యాగులను ఉచితంగా అందించారు.

## గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉంటా

**డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తా : బేత అనంతలక్ష్మి**




కొత్తగూడెం ( ) ఎన్నికల్లో గెలుపొటములు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉండి సేవా చేయాలనే సిద్దాంతాన్ని పాటిస్తు కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటమికి క్రుంగిపోకుండా, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారం చేయడంతో పాటుగా, డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని 60 డివిజన్ అభ్యర్థిని బేత అనంతలక్ష్మి తెలిపారు. ఎన్నికల సమయంలో తనతో కలిసి నడిచిన నాయకులు, కార్యకర్తలు, తన మీద నమ్మకంతో ఓట్లు వేసిన 60వ డివిజన్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె ఎల్లపుడు అందుబాటులో ఉంటానని, తనను నమ్మి అవకాశం ఇచ్చిన సిపిఐ పార్టీకి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా లకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేస్తానని ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుధ్యం, మంచినీటి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో నిరంతరం పని చేస్తానని తెలిపారు.

# వైయస్‌లా రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ పార్టీని తన గుప్పెట్లో తెచ్చుకున్నట్లేనా..?

### వ్యక్తిగత చరిష్మాతో ముందుకు

### మొదట్లో వ్యతిరేకత.. ఇప్పుడు జై జైలు

హైదరాబాదు (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదురులేని నాయకుడిగా ఎదుగుతున్నారు. ఒకప్పుడు వైఎస్ ఉమ్మడి రాష్ట్ర కాంగ్రెస్ పై ఎలాంటి పట్టు సాధించారో ఇప్పుడు రేవంత్ కూడా అలాంటి పట్టు సాధిస్తున్నారు. ఢిల్లీ పర్యటనలో ఆయన చేసి నేనే రాజు.. నేనే మంత్రి అన్న వ్యాఖ్య కేవలం ఒక మాట మాత్రమే కాదు, తెలంగాణ కాంగ్రెస్‌పై ఆయన సాధించిన తిరుగులేని పట్టుకు అద్దం పడుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి కాంగ్రెస్ పార్టీని తన గుప్పిట్లోకి ఎలా తెచ్చుకున్నారో, నేడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ మొత్తాన్ని తన గుప్పెట్లోకి తెచ్చుకున్నారు.

### హైకమాండ్ నమ్మకం - సొంత ముద్ర

కాంగ్రెస్ పార్టీలో సాధారణంగా ఒక ముఖ్యమంత్రికి హైకమాండ్ వద్ద పలుకుబడి సాధించడం అంత సులభం కాదు. కానీ రేవంత్ రెడ్డి అనతి కాలంలోనే గాంధీ కుటుంబం వద్ద అత్యంత విశ్వసనీయతను సంపాదించుకున్నారు. గతంలో వైఎస్ఆర్ ఎలాగైతే తన వ్యక్తిగత చరిష్మాతో ఢిల్లీని ఒప్పించి, రాష్ట్రంలో తన మాటకు ఎదురులేకుండా చేసుకున్నారో, నేడు రేవంత్ కూడా అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. అధిష్టానం ఆయనను కేవలం ఒక సీఎంగానే కాకుండా, పార్టీని నిలబెట్టే బలమైన శక్తిగా చూస్తోంది. అందుకే కేబినెట్ విస్తరణ వంటి కీలక అంశాల్లో కూడా రేవంత్ మాటే తుది నిర్ణయంగా మారింది.

### అంతర్గత అసమ్మతిని అణచివేసిన రేవంత్

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొత్తలో సీనియర్ నేతల నుంచి బాగానే వ్యతిరేకత ఎదురైంది. అయితే తన వ్యూహాలతో వారిని తన దారిలోకి తెచ్చుకోవడంలో ఆయన విజయం సాధించారు. రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు రేవంత్ నాయకత్వంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఆయనను ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి సీనియర్లు కూడా రేవంత్‌ను సమర్థించడం రేవంత్ కు జై కొట్టడం మొదలుపెట్టారు. ఇప్పుడు పార్టీలో రేవంత్ నిర్ణయాలకు ఎదురుచెప్పే సాహసం ఎవరు చేయడం లేదు. విమర్శించిన వారే ఇప్పుడు ఆయన నాయకత్వాన్ని బలపరుస్తుండటం రేవంత్ సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం.

### వైఎస్ఆర్ తరహాలో పట్టు

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ఎలాగైతే పార్టీని తన కంట్రోల్‌లోకి తెచ్చుకున్నారో, రేవంత్ రెడ్డి కూడా పీసీసీ ప్రెసిడెంట్ స్థాయి నుంచి నేరుగా ప్రజలతో మమేకమై అధికారాన్ని చేపట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనాపరమైన నిర్ణయాల్లో తనదే అంతిమ నిర్ణయం అని చాటిచెప్పడం ద్వారా పార్టీ శ్రేణులకు స్పష్టమైన సందేశాన్ని పంపారు. విపక్షాల విమర్శలను తనదైన శైలిలో తిప్పికొడుతూ, పాలనపై పట్టు బిగించడం రేవంత్ ప్రత్యేకత. ఇది ఒకప్పుడు వైఎస్ఆర్ హయాంలో కనిపించిన రాజకీయ స్థిరత్వాన్ని గుర్తుచేస్తోంది. రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక కొత్త



సంస్కృతిని తీసుకువచ్చారు. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, పార్టీ మొత్తాన్ని తన నాయకత్వం కింద ఏకం చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారని అనుకోవచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ ను ఓడించి అధికారంలోకి రావడం అసాధ్యం అనుకున్న వాళ్లు ఈరోజు రేవంత్ రెడ్డి ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇది కేవలం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమైంది. ఆయన వల్లనే అధికారంలోకి వచ్చాం అన్నట్టుగా మార్చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి

### - ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు.

సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీలోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

## సికింద్రాబాద్,ఉప్పల్ మార్గంలో

# రోడ్లపై వ్యాపారాల దందా

### వాహనదారుల ప్రాణాలతో ఆటలాడుతున్న నిర్లక్ష్యం

### ప్రమాదాలు జరిగి ఆసుపత్రుల పాలవుతున్న వాహనదారులు

### రోజంతా ఫుట్ పాత్, రోడ్లపైనే యదేచ్ఛగా వ్యాపారాలు

### చెప్పి చెప్పి అలసిపోతున్న ట్రాఫిక్ పోలీసులు

### రోడ్ల వ్యాపారాలపై ఉక్కు పాదం మోపాలని వాహనదారుల విన్నపం




తార్నాక రహదారిపై వ్యాపారుల బండ్లు



కాలనీకి వెళ్లే మూల రోడ్డుపై వ్యాపారం

సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)(సికింద్రాబాద్ నుండి ఉప్పల్ వరకు ప్రధాన రహదారులపై అక్రమంగా బండ్లు, తాత్కాలిక షాపులు పెట్టి జరుగుతున్న వ్యాపారం రోజురోజుకు పెరుగుతూ ట్రాఫిక్‌కు పెద్ద ముప్పుగా మారుతోంది. ఇప్పటికే రద్దీతో కిక్కిరిసే ఈ మార్గంలో రోడ్లు, ఫుట్ పాత్ లపై వ్యాపారాలు వాహనదారులకు ప్రాణాపాయంను సృష్టిస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రహదారులే మార్కెట్లుగా మారిన పరిస్థితి

సికింద్రాబాద్ నుండి ఉప్పల్ వరకు
ప్రధాన రోడ్ల పక్కనే కాకుండా ఫుట్ పాత్, నేరుగా రోడ్డుమధ్యలో అల్లం ఎల్లిగడ్డ, కూరగాయలు, పువ్వులు, పండ్లు, ఉల్లిగడ్డలు, కూరగాయల ఆటోలు, ఫుట్ పాత్ లపై భోజనాలు, అన్ని రకాల కూరగాయల బండ్లు పెట్టి వ్యాపారం చేయడం వల్ల వాహనాలు అకస్మాత్తుగా మలుపులు తిప్పుకోవాల్సి వస్తోంది. ఉదయం 11:00 నుండి మధ్యరాత్రి వరకు ఈ మార్గం వ్యాపారాలు నిర్వహించడంతో పాటు ముఖ్యంగా సాయంత్రం ట్రాఫిక్‌తో కుక్కిరిసిపోతుండగా, రోడ్లపై వ్యాపారాల వల్ల పరిస్థితి మరింత క్లిష్టం మారుతుంది దీనిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని వాహనాదారులు కోరుతున్నారు.

### స్థానికుల, వాహనదారుల ఆవేదన..

"రోడ్డుపై బండ్లు పెడతారు, వాహనం వెళ్లేందుకు కూడా చోటు ఉండదు, చిన్న తప్పిదం జరిగిన ప్రాణాపాయం జరగవచ్చు, వ్యాపారులను ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని ట్రాఫిక్ పోలీసులనే లెక్కచేయని ఈ వ్యాపారులు వాహనాదారుల ను లెక్క చేయగలరా.? ఏమైనా అంటే ముకుమ్మగాడిగా దాడులకు దిగడంతో పాటు బూతు మాటలతో దుర్భాషలాడతారని వాహనాదారులు భయాందోళనకు గురవుతున్నారు.

### ట్రాఫిక్ పోలీసుల మాటకు లెక్కలేదా.?

ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కొంతమంది వ్యాపారులు "ససేమీరా" అంటూ తిరిగి అదే చోట వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్, ట్రాఫిక్ పోలీసుల చర్యలు తాత్కాలికంగానే ఉండటం వల్ల పరిస్థితి మళ్లీ యథాస్థితికి వస్తోందని వాహనదారులు అంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప పరిస్థితి అదుపులోకి రాదని వాహనాదారులకు సురక్షితమైన ప్రయాణం జరగదని సూచిస్తున్నారు.

### ప్రమాదాలతో ఆసుపత్రుల పాలవుతున్న బాధితులు

రోడ్లపై ఆక్రమణల కారణంగా ఇప్పటికే చిన్నా,పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారు.
అకస్మాత్తుగా బ్రేక్ వేయడం వల్ల వెనుక వాహనాలు ఢీకొట్టడం
పాదచారులు, ద్విచక్రవాహనదారులు పడిపోవడం
రాత్రివేళల్లో కనిపించక ప్రమాదాలు జరగడం, కాలనీ కి వెళ్లే దారులలో బండ్లు పెట్టడం వల్ల
ఇలాంటి ఘటనలతో చాలామంది ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వాహనదారుల డిమాండ్

ప్రజలు, వాహనదారులు ఉన్నత అధికారులకు పలు
రహదారులపై వ్యాపారాలను పూర్తిగా తొలగించాలని, రోడ్లపై వ్యాపారాలను పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఫుట్ పాత్, రోడ్ల వ్యాపారాలను శాశ్వతంగా తొలగించాలనిప్రత్యామ్నాయంగా హాకర్లకు ప్రత్యేక జోన్లు కేటాయించి ఈ సమస్యపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మేల్కొని శాశ్వత పరిష్కారం చూపాలి, లేనిపక్షంలో పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.? అని వాహనాదారులు ప్రశ్నిస్తున్నారు. సికింద్రాబాద్, ఉప్పల్ ప్రధాన మార్గం నగరానికి కీలక రవాణా మార్గం కావడంతో రోడ్లపై అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# రోడ్లను ఆక్రమిస్తూ భవన నిర్మాణం

### -అధికారుల తీరు పట్ల స్థానికుల ఆగ్రహం

### -అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు

### -తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్





జవహార్ నగర్ (ప్రశ్న న్యూస్) మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న అక్రమ భవన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మల్కాజిగిరి జోనల్ కీసర సర్కిల్ జవహర్ నగర్ ప్రాంతంలో గల సుక్కమ బస్తి నల్ల పోచమ్మ దేవాలయం వద్ద ప్రధాన రహదారిని ఆక్రమిస్తూ యదేచ్ఛగా నిర్మిస్తున్న భవన నిర్మాణం పై మున్సిపల్ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జవహర్ నగర్ గ్రామపంచాయతీ హయాంలో గ్రామపంచాయతీ నిబంధన ప్రకారం నిర్మించుకున్న అదే నివాస నిర్మాణాన్ని నేడు జవహర్ నగర్ జిహెచ్ఎంసి ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈ సమయంలో పురాతన నిర్మాణాన్ని ఇరువైపులా మూడు అడుగుల రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తూ అక్రమ మార్గంలో నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణం వ్యవహారం నేడు చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి భవన నిర్మాణాల వద్ద మున్సిపల్ అధికార యంత్రాంగం దొడ్డిదారిన దోపిడీకి పాల్పడుతూ అక్రమ మార్గంలో పెద్ద ఎత్తున ముట్ట చెప్పే ముడుపులకు ముచ్చటపడుతూ మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కుతూ విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా.? అనే ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించకపోవడం వెనక లంచాలే కారణమన్న విమర్శలు ఉన్నాయి. రోడ్లు ఆక్రమించిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు అంటే మున్సిపల్ వ్యవస్థ ఉండి ఎవరికి ఉపయోగ ఉన్నత అధికారులకే తెలియాలి.

### అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నారా.?

అధికారులు నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ఎలాంటి అక్రమ సంపాదనకు ఆసక్తి చెప్పకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే ఈ రోడ్డును ఆక్రమిస్తూ నిర్మిస్తున్న భవన నిర్మాణం పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎలా నిర్మాణం పనులు కొనసాగించబడుతున్నాయి అనే ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. అధికారులు ముడుపులకు ముచ్చట పడుతూ మున్సిపల్ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు అనడానికి ఇరువైపుల రోడ్డును ఆక్రమించి నిర్మించబడుతున్న ఈ అక్రమ భవన నిర్మాణం నిలువెత్తు నిదర్శనం కాదా.? దీనిపై ఉన్నత అధికారుల మౌనం ఎందుకు.? మున్సిపల్ చట్టం ప్రకారం సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకపోవడమే కాకుండా భవన నిర్మాణానికి ఇరువైపులా రోడ్లను సైతం ఆక్రమిస్తూ నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకొని మున్సిపల్ నిబంధనల ప్రకారం నిర్మాణం పనులు జరిగేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల ఈ భవన నిర్మాణం వ్యవహారం పట్ల అధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పై జోనల్ కమిషనర్, కమిషనర్ కు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588